సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



యువతకు ఆదర్శంగా..

పలువురు మధ్య వయస్కులు మారథాన్‌లో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివరాలు 8లో ▸



పునరుద్ధరణకు ప్రతిపాదన

అలంపూర్‌లో పురాతన ఆలయాలు పునరుద్ధరించేందుకు కృషిచేస్తున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /23.2

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కందనూలు: అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అంబేద్కర్ స్టడీ సెంటర్ సమన్వయ కర్త వర్కాల శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఏదేని రెండేళ్ల డిప్లొమా కోర్సు పూర్తిచేసిన వారు డిగ్రీ అడ్మిషన్ పొందుటకు అర్హులని, అన్ని పోటీ పరీక్షలకు అర్హతతోపాటు ప్రమోషన్లకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు, గృహిణులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నం. 7382929779ను సంప్రదించాలని తెలిపారు.

నేడు జిల్లాలో రోల్ అబ్జర్వర్ పర్యటన

నాగర్‌కర్నూల్: జిల్లా రోల్ అబ్జర్వర్ ఐఏఎస్ భారతి లక్పతినాయక్ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, బీఎల్‌ఓలతో ఓటరు నమోదు, ఎస్.ఎస్.ఆర్.2 పై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టుమెట్రిక్ బాలుర హాస్టల్‌లో 2023– 24 సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధ్రువ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, టీసీ, బోనోఫైడ్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తును జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. మిగతా వివరాల కోసం వార్డెన్ మసూద్ సెల్ నం.9491486472ను సంప్రదించాలని సూచించారు.



నార్లాపూర్, ఎల్లూరు రిజర్వాయర్లను అనుసంధానిస్తూ ఏర్పాటు చేసిన స్లూయిస్ (తూము)

మిషన్ భగీరథ బాధ్యత.. పాలమూరుకు

- నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు స్లూయిస్ ఏర్పాటు
- ప్రస్తుతానికి తాగునీటి అవసరాల కోసమే నీటి కేటాయింపు
- భవిష్యత్‌లో సాగునీటికి సైతం వినియోగించే అవకాశం
- ఇకపై కేఎల్ఐకి తీరనున్న ఎత్తిపోతల కష్టాలు
- 'కల్వకుర్తి'లో పాడైన మోటార్ల మరమ్మతుకు వెసులుబాటు

కొల్లాపూర్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభమవుతుండటంతో కేఎల్ఐ ప్రాజెక్టుపై ఇన్నాళ్లు ఉన్న భారం తగ్గనుంది. కొన్నేళ్లుగా కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీటి అవసరాలతోపాటు తాగునీటి కోసం మిషన్ భగీరథకు కూడా నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో కేఎల్ఐ ప్రాజెక్టు మోటార్లకు విశ్రాంతి లేకుండా నీటి పంపింగ్ చేపడుతున్నారు. పాలమూరు ప్రాజెక్టు ప్రారంభమైతే కేఎల్ఐ ప్రాజెక్టుకు ఉన్న కష్టాలు చాలా వరకు తగ్గనున్నాయి. ఫలితంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల్లోని 74 మండలాల్లో 1,428 గ్రామాలకు తాగునీరందించే బాధ్యత పాలమూరు ప్రాజెక్టుపై పడనుంది.

రెండు మోటార్లతో సరఫరా..

కేఎల్ఐ పంప్‌హౌజ్‌లో 5 మోటార్లు ఉండగా వీటిలో రెండు పాడయ్యాయి. మిగిలిన మూడింటిలో రెండింటితోనే రెగ్యులర్‌గా నీటి ఎత్తిపోతలు చేపడుతున్నారు. కేఎల్ఐ పరిధిలోని 3 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగునీటితోపాటు మిషన్ భగీరథ స్కీంకు అవసరమైన నీటిని పంపింగ్ చేస్తున్నారు. దీంతో కేఎల్ఐ పంప్ మోటార్లకు విశ్రాంతి లేకుండా పోతోంది. పాడైపోయిన మోటార్లకు రిపేర్లు చేయాలంటే ఎత్తిపోతలు కొన్ని నెలల పాటు నిలిపివేయాల్సి ఉంటుంది. తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయనే ఉద్దేశంతో ఉన్న మోటార్లతోనే నిరంతరం ఎత్తిపోస్తున్నారు. పాలమూరు ప్రాజెక్టు ప్రారంభమైతే కేఎల్ఐ ప్రాజెక్టులోని మోటార్లకు రిపేర్లతోపాటు ఇతర పనులు చేపట్టేందుకు వెసులుబాటు లభిస్తుంది.

తాగునీటి కోసం..

సుప్రీంకోర్టు ఆదేశానుసారం 7.02 టీఎంసీ మేరకు తాగునీటి అవసరాల కోసం పాలమూరు ప్రాజెక్టు ద్వారా కృష్ణానీటిని ఎత్తిపోసుకోవచ్చు. సాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోసుకునేందుకు ఇంకా పూర్తిస్థాయి అనుమతులు రానందున ప్రస్తుతం తాగునీటికి మాత్రమే నీటి పంపింగ్ చేపట్టనున్నారు. మిషన్ భగీరథ స్కీం పంప్‌హౌజ్‌ను కేఎల్ఐ పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్‌కు అనుసంధానంగా నిర్మించారు. కేఎల్ఐ ద్వారా పంపింగ్ చేస్తున్న నీటినే మిషన్ భగీరథ పథకానికి సరఫరా చేస్తున్నారు. ఎల్లూరు రిజర్వాయర్‌లోకి పాలమూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తే కేఎల్ఐ మోటార్లకు విరామం లభించే అవకాశం ఉంది.

స్లూయిస్ ఏర్పాటుతో..

పాలమూరు ప్రాజెక్టు ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లించేందుకు బోడబండతండా సమీపంలో స్లూయిస్ (తూము) ఏర్పాటు చేశారు. నార్లాపూర్ రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీరు చేరితే స్లూయిస్ ద్వారా ఎల్లూరు రిజర్వాయర్‌లోకి నీరు వస్తుంది. ప్రతిరోజూ వెయ్యి క్యూసెక్కులకుపైగా నీటిని ఎల్లూరు రిజర్వాయర్‌లోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడి నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలకు తాగునీరు, పరిశ్రమల అవసరాలకు నీటిని సరఫరా చేయనున్నారు.

రిజర్వాయర్లను అనుసంధానించాం



పాలమూరు ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం తాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోయనున్నాం. మిషన్ భగీరథ స్కీం కేఎల్ఐ పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్‌కు అటాచ్‌గా ఉంది. నార్లాపూర్, ఎల్లూరు రిజర్వాయర్లను అనుసంధానిస్తూ స్లూయిస్ ఏర్పాటు చేశాం. నార్లాపూర్ రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీరు నిల్వ దాటితే స్లూయిస్ ద్వారా ఎల్లూరు రిజర్వాయర్‌లోకి నీళ్లు చేరేలా నిర్మాణాలు చేపట్టాం. కేఎల్ఐ ద్వారా నీటి పంపింగ్ నిలిచిపోయినా ఇక నుంచి మిషన్ భగీరథ స్కీంకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటి పారుదల శాఖ

ఇచ్చిన మాట ప్రకారం..



పాలమూరు ప్రాజెక్టు కారణంగా కేఎల్ఐ ఉనికి కోల్పోతుందని చాలామంది అనుమానాలు వ్యక్తం చేశారు. నేను పార్టీ మారే సమయంలోనూ ఈ విషయాన్ని సీఎం కేసీఆర్‌కు వివరించా. ఆయన నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేలా స్లూయిస్ పెట్టిస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం స్లూయిస్ పెట్టించారు.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

సాగునీటికి కూడా అవకాశం

పాలమూరు ప్రాజెక్టు కోసం గతంలో రూపొందించిన ఆయకట్టు డీపీఆర్‌లో కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎకరా భూమిని కూడా చేర్చ లేదు. ప్రాజెక్టు మా ప్రాంతంలో నిర్మించి.. కాల్వల కోసం వందలాది ఎకరాల భూమిని తీసుకొని.. మాకు లబ్ధి చేకూర్చకుంటే ఎలా అని ప్రజలు ప్రశ్నించారు. ఈ అంశాలను ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు స్లూయిస్ ఏర్పాటు చేసేలా డిజైన్లను మార్చారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

నాగర్‌కర్నూల్ క్రైం: రక్తదానం వల్ల ఆపదలో ఉన్న ఎన్నో ప్రాణాలు నిలుస్తాయని.. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ద మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై యువత గ్రామాల్లో ప్రజలకు అవగాహన పెంచి రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాలని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది క్షతగాత్రుల ప్రాణాలు ఆపద సమయంలో నిలుస్తాయని అన్నారు. జిల్లాలో రక్తం కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మెగా రక్తదాన శిబిరంలో 200 మంది మిషన్ విద్యార్థులతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొని 100 యూనిట్లు రక్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఫయాజుద్దీన్, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించాలి

బిజినేపల్లి: భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకోవాలని అప్పుడే భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా వారికి సహజ వనరుల్ని ఒక వరంగా అందించిన వాళ్లం అవుతామని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఖానాపూర్‌లో రైతు వేదిక వద్ద జాతీయ భూగర్భ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సంచార నీటి నాణ్యత ప్రయోగశాల రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పైలట్ స్టడీ కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ గ్రామంలో బోరుబావుల నీటి పరీక్ష మొబైల్ వాహనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ భూగర్భ జలాల సక్రమంగా వినియోగించుకుంటే విపత్కర పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చన్నారు. భూగర్భ జలాలు ఉన్న రైతులు నీటిని పరీక్షించి, వాటిలో ఏఏ పోషకాలు లోపించాయో తెలుసుకుని, భూమికి, మొక్కలకు లోపించిన పోషకాలు మరో పద్ధతిలో అందించవచ్చన్నారు. కొందరు రైతుల నుంచి బోరు బావుల నుంచి నీటిని సేకరించి పరీక్షించారు. కార్యక్రమంలో హైదరాబాద్ భూగర్భ జల శాఖ జాయింట్ డైరెక్టర్ కే. లక్మా, డిప్యూటీ డైరెక్టర్ రాకేష్ చందర్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌యాదవ్, డీఏఓ వేంకటేశ్వర్లు, పాలెం కేవీకే కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడు, సర్పంచు సితార, ఎంపీటీసీ రఘుమారెడ్డి, అధికార ప్రజా ప్రతినిధులు మాథ్యూస్, లింగస్వామి, నవీన్‌రెడ్డి, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



భూగర్భ నీటి పరీక్ష మొబైల్ వాహనంతో అధికార ప్రజాప్రతినిధులు

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

కల్వకుర్తి టౌన్: దేశ రాజ్యాంగం ప్రతిఒక్కరికి మార్గదర్శకమని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ డా.చంద్రయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు మానవహక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విధిగా రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవటంతో పాటుగా వారి ఉన్న హక్కులను గుర్తుంచుకోవాలని అన్నారు. రాజ్యాంగంలోని పలు అంశాలను తెలుసుకోవటం వలన భవిష్యత్తులో పలువురికి రాజ్యాంగంపై అవగాహన కల్పించిన వారవుతారని సూచించారు. ప్రజలైనా, పాలకులైనా, అధికారులైనా రాజ్యాంగ బద్ధంగా వారి పాత్రలను నిర్వర్తించాలని, అప్పుడే అందుకు తగిన గౌరవం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఆలోచనలు చేస్తూ చదువు సాగించటంతో ఉజ్వల భవిష్యత్తుని అందుకుంటారని వారికి సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, రాష్ట్ర మానవహక్కుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, సంఘం సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య

అవయవదానం.. ప్రాణదానంతో సమానం



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, వైద్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: అవయవదానం ప్రాణదానంతో సమానమని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. మరణానంతరం అవసరమైన వ్యక్తులకు అవయవదానం చేస్తానని వైద్యాధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వర్చువల్ విధానంలో డీఎంహెచ్‌ఓ డా. సుధాకర్‌లాల్, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.రమాదేవి పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించారని, దేశంలో ఎంతో మందికి వైద్య సేవలు అందనున్నట్లు తెలిపారు.

చరిత్ర పుస్తకావిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడేలా ఎంవీఎస్ కళాశాల అధ్యాపకులు రాఘవేందర్ రెడ్డి, శేర్‌లింగ్, గోపాల్‌రాథోడ్ కలిసి రచించిన చరిత్ర పుస్తకాన్ని పాలమూరు యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, సత్యనారాయణ, ఈశ్వరయ్య, సత్యభాస్కర్‌రెడ్డి, ఆరీఫాజబీన్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా.. రాజకీయం

కాషాయ గూటికి మాజీ మంత్రి?

- కల్వకుర్తిలో చిత్తరంజన్‌దాస్‌ను కలిసిన ఈటల రాజేందర్
- బీజేపీలోకి రావాలని ఆహ్వానం
- జిల్లాలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు



మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ నివాసంలో భేటీ అయిన బీజేపీ నేతలు ఈటల, జితేందర్‌రెడ్డి, ఆచారి తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నాగర్‌కర్నూల్ జిల్లాలో రాజకీయ సమీకరణాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోకి వలసల జోరు కొనసాగుతుండగా.. బీజేపీ సైతం చేరికలపై దృష్టిపెడుతూ సరికొత్త వ్యూహాలను రచిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్‌ను పార్టీలో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసింది. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌ను ఓడించిన నాయకుడిగా రాష్ట్రస్థాయిలో చిత్తరంజన్‌దాస్ సుపరిచితులు. ఆయన్ను పార్టీలో చేర్చుకోవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపాలని బీజేపీ యత్నిస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం కల్వకుర్తిలోని చిత్తరంజన్‌దాస్ ఇంటికి బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రావడం, చిత్తరంజన్‌దాస్‌ను పార్టీలోకి ఆహ్వానించడంతో ఆయన చేరిక ముమ్మందు ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందోనన్న చర్చ సాగుతోంది.

ఎన్టీఆర్‌ను ఓడించిన నేతగా గుర్తింపు..

జిల్లాలోని కల్వకుర్తి మండలం ఎల్లికట్టకు చెందిన జక్కుల చిత్తరంజన్‌దాస్ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కల్వకుర్తి స్థానం నుంచి పోటీచేయగా.. ఆయనపై కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన చిత్తరంజన్‌దాస్ గెలుపొంది సంచలనం సృష్టించారు. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. తర్వాత 1999లో టీడీపీలో చేరారు. మళ్లీ 2004 నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతూనే 2014 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. అనంతరం కాంగ్రెస్‌లో కొనసాగుతూ 2018లో బీఆర్ఎస్‌లో చేరారు.

ఆత్మగౌరవం కరువైందంటూ..

గత ఐదేళ్లుగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నా ఆ పార్టీలో తనకు ఆత్మగౌరవం కరువైందని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎవరినీ లెక్కచేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఓ క్రమంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు పార్టీ నుంచి టికెట్ ఇవ్వొద్దని, బదులుగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని ప్రకటించారు. తాజాగా బీఆర్ఎస్ నుంచి మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కే టికెట్ ఖరారుకావడం, పార్టీలో తమకు సముచిత స్థానం కరువైందన్న భావన నేపథ్యంలో ఆయన పార్టీ వీడేందుకే మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. బీజేపీలో చేరితే జడ్చర్ల అసెంబ్లీ స్థానం నుంచి బరిలో ఉంటారని సైతం ప్రచారం సాగుతోంది. గతంలో తాను సేవలందించిన మిడ్జిల్, ఊర్కొండ మండలాలు ఇప్పుడు జడ్చర్ల నియోజకవర్గంలో ఉన్నాయని, అవకాశం ఉంటే జడ్చర్ల నుంచే బీజేపీ తరఫున పోటీ చేస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

చిత్తరంజన్‌దాస్ ఇంటికి ఈటల..

బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ముందుగా కల్వకుర్తిలోని చిత్తరంజన్‌దాస్ ఇంటికి చేరుకున్నారు. బీజేపీ నేతలు మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, అశ్వత్థామరెడ్డి, ఆచారి తదితరులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన అనంతరం చిత్తరంజన్‌దాస్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన్ను పార్టీలోకి రావాలని ఈటల ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఇందుకోసం కేంద్ర మంత్రి అమిత్‌షా, ఇతర జాతీయ స్థాయి నేతలతోనూ చర్చిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. తాజా పరిణామాలతో చిత్తరంజన్‌దాస్ బీఆర్ఎస్‌ను వీడి కాషాయ కండువా కప్పుకోనున్నట్టు స్పష్టమవుతోంది. కల్వకుర్తి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో చేజారిన ఓటమిని ఈసారి ఎలాగైనా చేజిక్కించుకోవాలని బీజేపీ పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ చేరిక తమకు మేలు చేస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. అయితే ఎన్నికలకు రోజులు దగ్గరపడుతున్న కొద్దీ చోటుచేసుకుంటున్న పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూత

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: రాష్ట్రంలో పేదోడి ఇంట్లో ఆడపిల్ల పెళ్లికి సర్కారు చేయూతనిచ్చేందుకు ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకంతో సీఎం కేసీఆర్ పెద్దకొడుకు అయ్యారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజవర్గంలోని అడ్డాకుల మండలం పెద్ద మునగాల్‌చేడ్, కన్మనూరు తదితర గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ సీఐ దామోదర్‌రెడ్డి, పెద్దమునగాల్‌చేడ్ ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రయ్య సాగర్, నాయకులు గణేష్, భీంరెడ్డి, శ్రీధర్ నర్సింహ, రాఘవేంద్ర, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు..

పెబ్బేరు, రేవల్లి మండలాలకు చెందిన వివిధ గ్రామాల బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు సుమారు 250 మంది బుధవారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి తన క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు అల్లాజీది ప్రభుత్వ హత్యే..

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన వట్టెం రిజర్వాయర్ కింద భూమిని కోల్పోయిన రైతు అల్లాజీ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డీసీసీ అధ్యక్షుడు డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర గ్రామానికి చెందిన అల్లోజీ కుటుంబానికి ఉన్న 19 ఎకరాలను ప్రభుత్వం రిజర్వాయర్ కోసం తీసుకుందని చెప్పారు. వారి కుటుంబానికి ఈ భూమి తప్పా మిగితా ఎక్కడా భూమి లేదన్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఎకరాకు కనీసం రూ. 25 లక్షల రేటు పలుకుతుంటే ప్రభుత్వం ఎకరాకు రూ. 2.04 లక్షలు మాత్రమే ఇస్తామనడం దారుణమని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పాలమూరు ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ రైతులను మోసం చేశారని మండిపడ్డారు. ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నా, ప్రభుత్వం నుంచి న్యాయమైన పరిహారం రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో అల్లోజీ ఆత్మహత్యకు పాల్పడ్డారని వివరించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల భూముల విలువకు మూడు రెట్ల పరిహారం అందిస్తే రైతులకు న్యాయం జరిగేదన్నారు. రూ.లక్షల కోట్ల అప్పులు చేసి సీఎం కేసీఆర్ ఎవరిని ఉద్ధరించారని ప్రశ్నించారు. రైతులు మనస్తాపంతో ఆత్మహత్యలు చేసుకోవద్దని, రాబోయే మూడు నెలల్లో వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుందని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేయకుండానే ఎన్నికల్లో ప్రచారం కోసం సీఎం కేసీఆర్ ఒక్క మోటారును ప్రారంభిస్తున్నారని అన్నారు. తాము ప్రాజెక్టులను పరిశీలించేందుకు వెళ్తే ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాగం శశిధర్‌రెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, అర్థం రవి, కోటయ్య, హబీబ్, పాండు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి సొంత ప్రయోజనాలపై దృష్టి సారించారని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. బుధవారం మండలంలోని గోప్లాపూర్‌లో నిర్వహించిన గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం, ప్రభుత్వం ఏర్పాటులో తన పాత్ర ఎంతో ఉందన్నారు. నాడు తెలంగాణ వద్దంటూ ఆంధ్రా పార్టీల వెంట తిరిగి, పాలమూరు ప్రాజెక్టు వద్దని చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి.. ఇప్పుడు పార్టీ మారి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌తో పాటు ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణమాఫీ, నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్, అర్హులందరికీ రూ.4 వేల పింఛన్, పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, అంబేడ్కర్ అభయహస్తం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షలు తదితర పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు, అభివృద్ధి పనులు తన హయంలో చేసినవేనని గుర్తుచేశారు. ప్రజలు ఆలోచించి పార్టీ మారిన ఎమ్మెల్యేకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగలి రాణి, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాందాపూర్ సర్పంచ్ జయరాములుసాగర్, పుల్లారావు, గోవర్ధన్‌సాగర్, దశరథం తదితరులు పాల్గొన్నారు.



గోప్లాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

మక్తల్: బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని బోదల్‌కుంటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు(37) మండల కేంద్రానికి బుధవారం రాత్రి 12:30 గంటలకు వెళ్తున్న సమయంలో కాచ్‌వార్ టోల్‌గేట్ దగ్గర బైక్ అదుపు తప్పి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి సమయంలో ఓ వ్యక్తి మక్తల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృత్యుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

ఆటో బోల్తాపడి మహిళ..

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శాంతినగర్‌కు చెందిన జయ్యమ్మ (50) నిత్యం గ్రామాల్లో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఆమె బావతో కలిసి అదే గ్రామానికి చెందిన నిక్షాన్ ఆటోలో కూరగాయలు వేసుకుని శాంతినగర్ నుంచి పుటాన్‌దొడ్డికి బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కోదండాపురం సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయ్యమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆటో డ్రైవర్‌తో పాటు మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కర్నూల్ తరలించగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

కోడేరు: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కావలి నర్సమ్మ(60) కుటుంబ సమస్యలతో ఇంట్లో బాధపడుతుండేది. మనస్తాపం చెంది ఊరి చివరలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

అన్న మందలించాడని తమ్ముడు..


జగదీశ్వర్‌రెడ్డి (ఫైల్)

కొత్తకోట: అన్న మందలించాడని తమ్ముడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుకన్య, రాజవర్ధన్‌రెడ్డిల చిన్న కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి(18) పట్టణ కేంద్రంలోని హిందుస్థాన్ ఏజెన్సీలో పనిచేస్తుండేవాడు. స్కూటీకి సంబంధించిన ఈఎంఐలు చెల్లించే విషయంలో జగదీశ్వర్‌రెడ్డి తన అన్న రాంరెడ్డి గొడవ పడటంతో మనస్తాపం చెంది జగదీశ్వర్‌రెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

యువతకు ఆదర్శంగా..


రన్నర్స్ వాకర్స్ సొసైటీ సభ్యులు

- రన్నర్స్ అండ్ వాకర్స్ సభ్యులు
- మధ్య వయసులోనూ మారథాన్, 5కే, 10కేరన్‌లో రాణిస్తున్న జడ్చర్ల వాసులు


మారథాన్‌లో పరుగుపెడుతున్న సభ్యులు

జడ్చర్ల టౌన్: వారంతా 40–60 ఏళ్లలోపు మధ్య వయస్కులు. వ్యాపార ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలతో బిజిబిజీగా జీవనం సాగిస్తున్నారు. అయినా యువతకు ధీటుగా మారథాన్ (21, 42కి.మీ పరుగు)లో పాల్గొంటూ పతకాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పట్టణానికి చెందిన రన్నర్స్ అండ్ వాకర్స్ సొసైటీ సభ్యులు. జడ్చర్ల ఫ్రెండ్స్ గ్రూప్‌నకు చెందిన 35మంది ఔత్సాహికులు రన్నర్స్ అండ్ వాకర్స్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని దేశవ్యాప్తంగా వివిధ మారథాన్ పోటీల్లో పాల్గొంటూ విజేతలుగా నిలుస్తు పతకాలు సాధిస్తున్నారు. కొందరు 5కే రన్‌లో మరికొందరు 10కే రన్, ఇంకొందరు హాఫ్ మారథాన్ (21కి.మీ.), మారథాన్ (42కి.మీ)పరుగులో పాల్గొంటూ పతకాలతోపాటు ప్రశంసలు పొందుతున్నారు. గ్రూప్ సభ్యులకు స్థానిక రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ తోడుగా నిలిచి రన్నింగ్, వాకింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి ముందుకు తీసుకెళ్లారు.


ఆరుపదుల వయసులోనూ మారథాన్‌లో పాల్గొంటున్న రామకృష్ణ

కార్డియాక్ రిహబ్ ఫౌండేషన్ సహకారంతో..

రన్నర్స్ వాకర్స్ గ్రూప్ చేసుకుని స్థానిక మైదానంలో పరుగు, వాకింగ్ చేసుకుంటున్న తరుణంలో హైదరాబాద్ కార్డియాక్ రిహబ్ ఫౌండేషన్ నిర్వాహకుడు డా.మురళీధర్ బాబి నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆకర్షించాయి. చిన్న వయసులోనే గుండెపోటుతో మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం, ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. అక్కడ పరుగుతో గుండె ఆరోగ్యం ఎలా ఉంచగలమో పరిశోధన చేసి స్టంట్స్ వేసుకున్న వారితో సైతం పరుగులో విజేతలుగా తయారు చేస్తున్నారని గుర్తించారు. ఆయన ప్రోత్సాహంతో గ్రూప్ సభ్యులు కొందరు 5కే రన్, మరికొందరు 10కే రన్, ఇంకొందరు 21, 42 కిలో మీటర్ల మారథాన్‌లలో పాల్గొనటం ఆరంభించారు. హైదరాబాద్‌తోపాటు దేశంలోని వివిధ పట్టణాల్లో నిర్వహించే మారథాన్‌లలోనూ వీరు పాల్గొంటున్నారు. ప్రస్తుతం నెలలో రెండు ఆదివారాలు హైదరాబాద్‌లో నిర్వహించే మారథాన్‌లో పాల్గొంటున్నారు.

కాలు విరిగినా పరుగులో..



నాకు కొన్నేళ్ల క్రితం కాలు విరిగింది. నడవటానికి కొంత ఇబ్బంది పడ్డాను. మా గ్రూప్ సభ్యులు ప్రోత్సాహం వల్ల రన్నింగ్ చేయటం ఆరంభించి విజయవంతంగా మారథాన్‌లో పాల్గొంటున్నాను. గాంధీ ఆస్పత్రిలో వైద్యురాలుగా పనిచేస్తున్న నా కూతురు చెప్పటం వల్ల కాలు విరిగినప్పటికి రన్నింగ్ చేయవచ్చని ముందుకు సాగాను.

– డీ.శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఉద్యోగి, జడ్చర్ల

ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను..



ఫిజికల్ డైరెక్టర్‌గా రిటైర్డ్ అయ్యాక జడ్చర్ల ఫ్రెండ్స్ సొసైటీ సహకారంతో రన్నర్ వాకర్స్ సొసైటీ ఏర్పాటు చేశాను. మూడేళ్లుగా సభ్యులకు తగిన సూచనలిస్తూ మారథాన్‌లో పాల్గొనేలా చూస్తున్నాను. వారితోపాటు నేను సైతం మారథాన్‌లో పాల్గొంటూ పతకాలు సాధిస్తు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను. రన్నింగ్ చేయటం వల్ల కలిగే ప్రయోజనాలు అందరికీ అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నా.

– రామకృష్ణ, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, బాదేపల్లి

అధిక బరువు తగ్గేందుకు..



అధిక బరువు తగ్గేందుకు ఫ్రెండ్స్ సలహా మేరకు వాకింగ్ చేయటం ఆరంభించాను. రన్నర్స్ వాకర్స్ సొసైటీలో చేరాక రన్నింగ్ సైతం ప్రారంభించి ఇప్పుడు 10కే రన్‌లో పాల్గొంటున్నా. మున్ముందు 42కి.మీ. మారథాన్‌లో పాల్గొనాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. వాకింగ్, రన్నింగ్ చేయటం వల్ల బరువు తగ్గి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండగలుగుతున్నాను.

– చిట్యాల శ్రీనివాసులు, మున్సిపల్ ఉద్యోగి, జడ్చర్ల

30 మారథాన్‌లో పాల్గొన్న..



మూడేళ్లకాలంలో 30 మారథాన్‌లో పాల్గొని నిర్ణీత సమయంలో గమ్యం చేరుకుని పతకాలు సాధించాను. ముఖ్యంగా రామకృష్ణ సలహాలు, రిహబ్ ఫౌండేషన్ ప్రోత్సాహం వల్ల రన్నింగ్ చేస్తూ ఎంతో ఆరోగ్యంగా ఉండగలుగుతున్నాను. రన్నింగ్ అనేది యువకులే చేయాలనే భావన నాలో ఉండేది. వయసుతో సంబంధం లేకుండా రన్నింగ్ చేస్తూ ఆరోగ్యంగా ఉండవచ్చని నాకు తెలిశాక నిత్యం శిక్షణ పొందుతూనే ఉన్నా.

– గోపాల్, రైల్వే సీనియర్ ఇంజినీర్, జడ్చర్ల

మీ సేవ నిర్వహిస్తూ..



కావేరమ్మపేటలో మీ సేవ నిర్వహించుకునే నేను మిత్రుల సహకారంతో పరుగులో పాల్గొనటం ఆరంభించాను. అప్పటి నుంచి ఆరోగ్యంగా ఉండటంతోపాటు మూడేళ్లలో 25 మారథాన్‌లో పాల్గొని విజేతగా నిలిచాను. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రన్నింగ్ చేస్తున్నాను. మారథాన్‌లో పాల్గొన్నపుడు ఎంతో మంది వృద్ధులు ఉత్సాహంగా పరుగు పెట్టడం చూసి రన్నింగ్‌కు వయసుతో సంబంధం లేదని ఉత్సాహం నిండింది.

– పీ. శ్రీనివాసులు, కావేరమ్మపేట

తాగుబోతుల తెలంగాణగా మార్చారు


కొల్లాపూర్‌లో మామిడి రైతుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- బీఆర్‌ఎస్‌ది కుటుంబ పాలన
- విజన్ కలిగిన పార్టీ బీజేపీ
- రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

అచ్చంపేట/ కొల్లాపూర్: మాటల్లో బంగారు తెలంగాణ కేసీఆర్‌ది.. చేతల్లో మంచి తెలంగాణ నిర్మించే బాధ్యత బీజేపీది అని పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని ఫంక్షన్ హాల్‌లో బీజేపీ అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం బూత్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీని ఆశీర్వదిస్తే.. ప్రధానమంత్రి మోదీ సహకారంతో కేంద్ర ప్రభుత్వ అండతో రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేసి చూపుతామన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ బెల్టుషాపులు ఏర్పాటు చేసి తాగుబోతుల తెలంగాణ మార్చారని దుయ్యబట్టారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, చాలామంది అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారని, భర్తను బతికించుకునేందుకు ఇల్లు, భూములు, పుస్తెల తాడు అమ్ముకునే పరిస్థితి దాపురించిందన్నారు. పుస్తెలతాడు కట్టడానికి కేసీఆర్ ఇచ్చే డబ్బు రూ.2,500 కోట్లయితే.. కొంపలు కొల్లేరు చేసి మన దగ్గర తీసుకుంటున్న డబ్బు రూ.45 వేల కోట్లకు చేరిందన్నారు. కేసీఆర్‌ది కుటుంబ పాలనైతే.. బీజేపీ, మోదీ 140 కోట్ల ప్రజలే నా కుటుంబమని చెప్పుకొంటారని, బీజేపీలో సీఎం, మంత్రులు ఎవరి భార్య, కొడుకులకు టికెట్లు ఇచ్చే సంస్కృతి లేదన్నారు. పదవులు పైసలు ఇచ్చి అంగట్లో కొనుకునే సరుకు కాదని, ప్రజలు ఓట్లు వేస్తే వచ్చేది ఎమ్మెల్యే పదవి అన్నారు. ఈ పదవి దోపిడీదారులు, దౌర్జన్యకారులకు ఇవ్వాలో.. ప్రజల కోసం పాటుపడే బీజేపీకి ఇవ్వాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మాయమాటలు చెబుతూ.. దౌర్జన్యం చేస్తూ ఓట్ల కోసం వస్తున్నారని, వారి మైకంలో పడొద్దన్నారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తూ బీఆర్‌ఎస్‌లోకి రమ్మని చెబుతున్నారని, ఓట్లు వేసేది అధికారులు, పోలీసులు కాదని, ప్రజలు అన్న విషయం బీఆర్‌ఎస్ నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ పాలెం రిజర్వాయర్ కింద కుమ్మెరకు చెందిన అల్లోజీ అనే రైతుకు చెందిన 19 ఎకరాల భూమి పోతే.. ఎకరాకు రూ.2.40 లక్షలు ఇస్తారా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎకరా రూ.20 లక్షలకు తక్కువ లేదని, కేసీఆర్ రైతు ఉసురు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

‘పాలమూరు’ను పూర్తిస్థాయిలో ప్రారంభించాలి..

పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని, అన్నిపనులు పూర్తిచేసిన తర్వాతే ప్రారంభించాలని బీజేపీ ఎస్సీ నియోజకవర్గాల కన్వీనర్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. తొమ్మిది మోటార్లకు గాను ఇప్పుడు ఒకటే ప్రారంభిస్తే 90 టీఎంసీల నీళ్లు ఎలా వస్తాయని.. మరోసారి రైతులను మోసం చేసేందుకే ఈ పథకం ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. ఆచారి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఇప్పుడు ప్రధాన మంత్రి మోదీ వైపు చూస్తున్నాయని, రాబోయే రోజుల్లో దేశం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో అవినీతి డబ్బు, అక్రమాలకు పాల్పడే నాయకులు ఎక్కువైపోయారని, కేసీఆర్ ఇచ్చిన హామీలు దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు ఎక్కడ అని ప్రశ్నించారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, జిల్లా ఇన్‌చార్జ్ వేముల నరేందర్‌రావు, కట్టా సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ భీమా, సతీష్‌మాదిగ, మంగ్యానాయక్, మండికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కావాలె..

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న అన్నదాతలకు రైతుబంధు కాదని.. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఈటల రాజేందర్ అన్నారు. మామిడి రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కొల్లాపూర్‌లో నిరసన దీక్ష చేపట్టగా.. ఈటల నిమ్మరసం అందించి విరమింపజేశారు. అనంతరం మామిడి రైతుల ఆత్మీయ సమ్మేళనానికి ఈటల హాజరై మాట్లాడారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణి అని కేసీఆరే చెబుతారు.. మళ్లీ వరి వేయొద్దు.. మొక్కజొన్న వేయొద్దు అని ఆయనే అంటారు.. ఎకరాకు రూ.5 వేల రైతుబంధు ఇచ్చి రైతులు ఏ పంటలు వేసుకోవాలో కేసీఆర్ చెప్పడం దారుణమన్నారు. పంటలు పండించే రైతులు నష్టాల పాలవుతున్నారని, బ్రోకర్లు మాత్రం బాగుపడుతున్నారని మండిపడ్డారు. నల్లగొండలో ఉద్యాన రైతుల కోసం మార్కెట్ పెట్టారు.. మరి పాలమూరు జిల్లా మామిడి రైతుల కోసం మార్కెట్ పెట్టరా అని నిలదీశారు. ప్రజల కోసం పనిచేస్తే గుండెల్లో పెట్టుకుంటారు.. లేదంటే బండకేసి కొడతారు అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. 40 ఏళ్ల క్రితం వ్యవసాయం ఉంటేనే ఇంటికి పిల్లని చ్చేవారు.. ఇప్పుడు వ్యవసాయం చేసేవారంటే పిల్లను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్ మామిడి రైతుల సమస్యలను కేంద్రానికి వివరిస్తానని.. రాష్ట్ర ప్రభుత్వానికి సైతం గుర్తుచేస్తానన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, తరుగు లేకుండా ధాన్యం కొనే పరిస్థితులు తీసుకొస్తామని, ఫసల్ బీమా అమలు చేస్తామని, వ్యవసాయ యంత్ర సామగ్రి సబ్సిడీపై అందిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో ఇది జరిగి తీరుతుందని చెప్పారు.

యువకుడిపై దుండగుల దాడి

- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స

అడ్డాకుల: మండలంలోని గుడిబండలో ఓ యువకుడిపై కొందరు గుర్తు తెలియని దుండగులు దాడి చేయడం కలకలం రేపింది. గొర్రెల మంద వద్ద నిద్రిస్తున్న యువకుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకుంట శివ యాదవ్ మంగళవారం రాత్రి గ్రామానికి సమీపంలో తమ గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. రాత్రి ఒక్కడే గొర్రెల వద్ద నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. శివ చనిపోయాడని భావించిన దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బుధవారం ఉదయం శివ తమ్ముడు సుధాకర్ యథావిధిగా గొర్రెల వద్దకు వెళ్లాడు. అక్కడ శివ తీవ్రగాయాలతో ఉండడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. బంధువులు బాధితుడిని జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. తండ్రి గోవిందు అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా శివపై ఎవరు దాడి చేశారు? ఎందుకు చేశారన్నది తెలియరాలేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివ మాట్లాడితే దాడి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

ఇంట్లో చోరీ

మక్తల్: మండలంలోని గుడిగండ్లలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డమీది శివరాజు, లక్ష్మి వ్యవసాయ కూలీ పనులకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం ఇంటికి రాగా, తాళం విరగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా 7తులాల బంగారం, 25తులాల వెండి, రూ.35వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘర్షణపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని పెద్దపల్లి గ్రామంలో బోనాల పండుగ, ఉట్లు కొట్టె సందర్భంగా చోటు చేసుకున్న గొడవలో తమకు తీవ్ర గాయలయ్యాయని, దాడి చేసినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అంజయ్య, రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రామంలో పోచమ్మ గుడి వద్ద బోనాల సమయంలో అదే గ్రామానికి చెందిన సిద్దు, రమేష్, ఉదయ్ తదితరులు దాడి చేశారన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూగజీవులను హతమార్చిన దుండగులు

వంగూరు: గుర్తుతెలియని వ్యక్తులు రెండు పాడిగేదెలను కరెంట్ షాక్ పెట్టి చంపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. మండలంలోని నర్సంపల్లికి చెందిన రైతు శ్రీశైలం తన వ్యవసాయపొలంలో రెండు పాడిగేదెలను కట్టేసి ఉంచాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బోరుకు విద్యుత్ సరఫరాచేసే స్టార్టర్ నుంచి రెండు ఆవుల మెడలకు వైరు కనెక్షన్ ఇచ్చి హతమార్చారు. బుధవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లే సరికి మృతి చెందిన ఆవులను చూసి కన్నీరుమున్నీరయ్యాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ ఆవుల మృతికి గల కారణాలపై దర్యాప్తు చేశారు. కొమ్ముల భాగంలో వైరు చుట్టి ఉండడంతో ఉద్దేశపూర్వకంగానే షాక్‌తో హతమార్చారని ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు. పశువైద్యాధికారి చేసిన పోస్టుమార్టం రిపోర్టులో కూడా ఇదే తేలిందని ఎస్‌ఐ తెలిపారు.

విలువ ఇవ్వని పార్టీలో ఉండలేను

కల్వకుర్తి: విలువ ఇవ్వని పార్టీలో ఉండలేనని త్వరలో కార్యకర్తల, శ్రేయోభిలాషుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా జైపాల్‌యాదవ్‌కు కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో చేరే ప్రసక్తే లేదన్నారు. త్వరలో ఏపార్టీలో చేరుతానన్నది ప్రకటిస్తానని వివరించారు.

మళ్లీ తెరపైకి..

మినీ ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై చర్చించిన మంత్రివర్గం

- ఇప్పటికే వరంగల్‌కు గ్రీన్‌సిగ్నల్
- దశలవారీగా మరో 5..వీటిలో దేవరకద్రకు చోటు
- నాలుగేళ్లుగా కొనసాగుతున్న సర్వేలు
- చివరగా చౌదర్‌పల్లి వద్ద నిర్మాణానికే మొగ్గు


ఎయిర్‌పోర్టు రన్‌వేకు స్థలం పరిశీలిస్తున్న అధికారుల బృందం(ఫైల్)

దేవరకద్ర: రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న మినీ విమానాశ్రయాల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆరుచోట్ల కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం కోసం గతంలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించగా.. ఏవియేషన్ అధికారులు పలు విడతలుగా రాష్ట్రంలో పర్యటించి ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా దేవరకద్ర సమీపంలోని చౌదర్‌పల్లి వద్ద ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం అక్కడి భూములు, పరిస్థితులను పలుమార్లు పరిశీలించి సర్వేలు చేశారు. ఎయిర్‌పోర్టుకు అన్నివిధాల అనుకూలమైన స్థలంగా భావించి జిల్లా ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖ అధికారులతో పలు నివేదికలు తెప్పించుకున్నారు. అయితే గత నాలుగేళ్లుగా ఎయిర్‌పోర్టు ఇప్పుడు అప్పుడు అంటూ వార్తలు వస్తున్నాయి తప్ప పనులు ప్రారంభం కాలేదు.

అన్ని రకాల సర్వేలు..

దేవరకద్ర సమీపంలోని చౌదర్‌పల్లి శివారులో డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ఇప్పటికే పలుమార్లు ఏవియేషన్ అథారిటీ అధికారులు పర్యటించి సర్వేలు చేశారు. ముందుగా అడ్డాకుల మండలం గుడిబండ వద్ద పరిశీలించగా అక్కడ హైటెన్షన్ విద్యుత్ లైన్ అడ్డంకిగా ఉందని గుర్తించారు. తర్వాత భూత్పూర్, మూసాపేట మండలాల్లో సైతం స్థలాలను చూశారు. చివరగా దేవరకద్రకు అతి సమీపంలో ఉన్న చౌదర్‌పల్లి శివారు భూములు అనువుగా ఉన్నట్లు తేల్చారు. ఇందుకోసం దాదాపు 500 ఎకరాల భూములు అవసరమవుతుందని పేర్కొన్నారు. అయితే ఇక్కడ 216 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. మిగతా 284 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించేందుకు భూములు గుర్తించి మ్యాప్‌లు సిద్ధం చేసి నివేదిక రూపొందించారు. రెవెన్యూ శాఖ సర్వే డిపార్టుమెంట్ కలిసి మ్యాప్‌ను రూపొందించి ఏఏఐ అధికారులకు అందజేశారు. ఆ తర్వాత వరుసగా ఢిల్లీ నుంచి అధికారుల బృందాలు వచ్చి వివిధ రకాల సర్వేలు జరిపారు. గడిచిన రెండు నెలల్లో మూడుసార్లు పర్యటించి రన్ వే, ఎయిర్‌పోర్టుకు స్థలం అనువుగా ఉందా.. విద్యుత్ లైన్ ఉన్నాయా.. గతంలో చేసిన సర్వేలు సరిగా ఉన్నాయా.. లేదా అని క్రాస్‌చెక్ చేశారు. ఏఏఐ అధికారుల ఆదేశాలతో హెచ్‌ఎల్‌ఎఫ్ నివేదికలను ఆర్అండ్‌బీ, మిషన్ కాకతీయ అధికారులు సంయుక్తంగా రూపొందించి అందజేశారు. ఇలా అన్ని రకాలుగా సర్వేలు పూర్తయ్యాయి. చివరగా ఎయిర్‌పోర్టుకు ఏఏఐ నుంచి ఆదేశాలు వస్తే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

డొమెస్టిక్ ఎయిర్ పోర్టు..

దేవరకద్ర సమీపంలో డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు చివరగా నిర్ణయం తీసుకున్నారు. ఇది జరిగి రెండేళ్లు గడిచింది. ఇంతకాలం స్తబ్దుగా ఉన్న ఎయిర్‌పోర్టుల విషయం ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించడంతో మళ్లీ తెర పైకి వచ్చింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య గ్యాప్ రావడంతో రెండేళ్లుగా మరుగున పడింది. ఆరింటిలో ముందుగా వరంగల్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభు త్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అక్కడ కావాల్సిన భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. గతంలో ఇక్కడ ఉన్న ఎయిర్‌పోర్టు స్థలంతోపాటు అదనంగా కావాల్సిన భూములు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగానే ఆగస్టు మొదటి వారంలో జరిగిన మంత్రివర్గ స మావేశంలో వరంగల్ ఎయిర్‌పోర్టుకు ఓకే చెప్పింది. మహబూబ్‌నగర్‌లోని దేవరకద్రతోపాటు ఆదిలాబాద్, పెద్దపల్లిలోని బసంత్‌నగర్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, కొత్తగూడెంలోని పాల్వంచ ఎయిర్‌పోర్టులను దశల వారిగా చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించడంతో మళ్లీ ఆశలు చిగురించాయి.

రెండేళ్ల క్రితమే సర్వే పూర్తి

రెండేళ్ల క్రితం ఏవియేషన్ ఢిల్లీ అధికారుల బృందం చివరిసారిగా చౌదర్‌పల్లి వద్దకు వచ్చి నివేదికలను మరోసారి సరిచూసుకున్నారు. చివరిసారిగా వారు సర్వే చేసి కొన్ని నివేదికలు ఆర్అండ్‌బీకి అప్పగించారు. చెప్పిన సర్వేలు పూర్తి చేసి నివేదికలు పంపించాం. వర్షపాతం, నీటి నిల్వపై నివేదికలతోపాటు హైటెన్షన్ విద్యుత్ తీగలు అడ్డంకులు లేవని నివేదిక రూపొందించి ఇచ్చాం. రెండేళ్లుగా వారి నుంచి ఎలాంటి ఆదేశాలు మళ్లీ రాలేదు.

– సంధ్య, డీఈ, ఆర్అండ్‌బీ

నివేదిక పంపించాం..

దేవరకద్ర సమీపంలోని చౌదర్‌పల్లి వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం వివిధ నివేదికలు ఇవ్వాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వారు కోరడంతో రాష్ట్ర అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు రెండేళ్ల క్రితమే మా శాఖ తరపున పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక పంపించాం. ఎయిర్‌పోర్టు ఎంపిక చేసిన స్థలంలో చెరువులు, కుంటలు ఇతర నీటి వనరుల అడ్డంకులు ఏమీ లేవని నివేదికలో పేర్కొన్నాం.

– శ్రీనివాస్, డీఈ, మిషన్ భగీరథ


కేంద్రం సహకరించకే జాప్యం..

కేంద్రం సహకరించకపోవడంతోనే ఎయిర్‌పోర్టు విషయంలో జాప్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆరు ఎయిర్‌పోర్టుల నిర్మాణం చేపట్టడానికి ఇప్పటికే నివేదికలు అందించింది. అందులో మూడు మొదటి విడతలో చేపడతారు. దీనికి మంత్రివర్గం కూడా నిర్ణయం తీసుకుంది. మిగతా మూడింటిలో దేవరకద్ర ఉంది. మరో విడతలో ఈ మూడు ఎయిర్‌పోర్టులను చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే దేవరకద్ర ఎయిర్‌పోర్టుకు సంబంధించి అన్ని సర్వేలు పూర్తి చేశారు.

– ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

క్లుప్తంగా...

ఇరిగేషన్ ఏఈల పదోన్నతులకు హైకోర్టు ఓకే



సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో 11 ఏళ్ల సర్వీసున్న అసిస్టెంట్ ఇంజనీర్ల పదోన్నతికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారంతా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతికి అర్హులేనని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జారీ చేసిన జీవో నంబర్ 112 సమర్థనీయమేనని స్పష్టం చేసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. నిబంధనలు సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెప్పింది. 2022, మార్చి 26న రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 112ను సవాల్ చేస్తూ నల్లగొండ మిర్యాలగూడకు చెందిన శ్రీనివాస్ నాయక్ సహా కొందరు ఏఈఈలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ జీవో తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ సర్వీస్ రూల్స్ 2018కి విరుద్ధమన్నారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం తుది ఉత్తర్వులు వెలువరించింది. ఏఈల ఇంప్లీడ్ పిటిషన్ వేసిన న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ఏఈలకు కూడా పదోన్నతులు ఇవ్వవచ్చని గతంలో ఇదే హైకోర్టులోని డివిజన్ బెంచ్ ఉత్తర్వు లు జారీ చేసిందని చెప్పారు. వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభుత్వ జీవోను సమర్థించింది. జీవోకు వ్య తిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది.

'రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లూ బదిలీకి అర్హులే'

సాక్షి, హైదరాబాద్: రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లు కూడా బదిలీలకు అర్హులేనని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే రెండేళ్ల కంటే ఎక్కువ సర్వీసున్న వారి బదిలీలు పూర్తయిన తర్వాత, మిగిలిన ఖాళీలకే తక్కువ సర్వీసున్న వారి దరఖాస్తులు పరిశీలించి, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. టీచర్ల బదిలీల కోసం ప్రభుత్వం జనవరి 25న జారీ చేసిన జీఓ నంబర్ 5, ఫిబ్రవరి 7న జారీ చేసిన జీఓ నంబర్ 9లో తమకు అవకాశం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లాకు చెందిన సొదమల్ల స్రవంతితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి కాలేదన్న కారణంగా తమను పరస్పర బదిలీకి కూడా అనుమతించకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్ల బదిలీలకూ అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

రేపు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం

- ఒకేసారి అందుబాటులోకి 9 వైద్య కాలేజీలు!
- సీఎం చేతుల మీదుగా ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయి. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శుక్రవారం వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామల్లో కొత్తగా ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర సొంత నిధులతో ఒకే ఏడాది ఇంత పెద్దసంఖ్యలో మెడికల్ కాలేజీలు ప్రారంభించడం దేశంలోనే ఇదే ప్రథమంగా చెబుతున్నారు.

కేసీఆర్ హయాంలోనే 21 మెడికల్ కళాశాలలు

తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, సీఎం కేసీఆర్ దశాబ్ద కాలంలోనే 21 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. కాగా, వచ్చే ఏడాది ప్రారంభించేందుకు మంజూరు చేసుకున్న 8 మెడికల్ కాలేజీలతో ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు పూర్తవుతుందని అధికారులు అంటున్నారు. 2014లో 5 మెడికల్ కాలేజీల ద్వారా 850 సీట్లు ఉంటే, 2023 నాటికి 26 మెడికల్ కాలేజీలతో సీట్ల సంఖ్య 3,690కి చేరింది. ప్రభుత్వ ప్రైవేటులో కలిపి ఏటా పది వేల మంది విద్యార్థులను తయారు చేసే స్థాయికి నేడు తెలంగాణ ఎదిగింది.

చట్టంలో మార్పులతో విస్తృత అవకాశాలు

2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్ కు ప్రభుత్వం సవరణ చేసిన సంగతి తెలిసిందే. గతంలో 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వ్‌డుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. తాజా నిర్ణయం వల్ల మన విద్యార్థులకు మరో 520 సీట్లు దక్కాయి. దీంతో పాటు ఎంబీబీఎస్ బీ కేటగిరి సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడం వల్ల రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మరో 1,300 ఎంబీబీఎస్ సీట్లు దక్కాయి. ఈ రెండు నిర్ణయాల వల్ల తెలంగాణ విద్యార్థులకు అదనంగా మొత్తం 1,820 సీట్లు ప్రతి ఏటా దక్కనున్నాయి.

సంపద పెరగాలంటే పరిశ్రమలు రావాలి

- మంత్రి కేటీఆర్
- సంగారెడ్డి జిల్లాలో మొనిన్ పరిశ్రమకు శంకుస్థాపన



మొనిన్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజకీయాలు ఎన్నికలు వచ్చినప్పుడు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, సంపద పెరగాలన్నా కొత్త పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు పెడితే స్థానికులకు నష్టం జరుగుతుందని కొందరు రాజకీయం కోసం వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అపోహలకు గురికాకుండా స్థానిక నాయకులు పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రీమియం సిరప్ తయారీ కంపెనీ మొనిన్ రూ.300 కోట్ల పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా గుంతపల్లిలో నిర్మించతలపెట్టిన ఫ్యాక్టరీకి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రగతిశీల విధానాలను చూసి వివిధ దేశాలకు చెందిన కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మొనిన్ కంపెనీ యాజమాన్యం దేశంలో 18 రాష్ట్రాల్లో తిరిగిందని, చివరకు తెలంగాణలో యూనిట్‌ను స్థాపిస్తోందని చెప్పారు. స్థానిక యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఈ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.

ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం..

రాష్ట్రం వ్యవసాయ రంగంలో గణనీయ వృద్ధిని సాధించిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 వేల మెట్రిక్ టన్నుల నుంచి మూడున్నర లక్షల టన్నులకు చేరి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి బాటలో కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, మొనిన్ సంస్థ చైర్మన్ ఓలివర్ మొనిన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే ఇక ఉపేక్షించం

మరింత బలోపేతంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు: డీఎంఈ రమేశ్ రెడ్డి

గాంధీఆస్పత్రి: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని, ఆయా కళాశాలలకు చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూ పొందించి అమలు చేస్తామని మెడికల్ ఎడ్యు కేషన్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన పదిమంది వైద్యవిద్యార్థులను ఏడాది పాటు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ పలువురు వైద్యవిద్యార్థు లు గురువారం గాంధీ కళాశాల ప్రాంగణంలో నిర సన చేపట్టారు. ఈ క్రమంలో డీఎంఈ, గాంధీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమో హన్, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తదిత రులు పలువురు వైద్యవిద్యార్థులతో మాట్లా డారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఆ పదిమంది సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధా రణ అయిందనీ, చర్యల విషయంలో పునరాలోచన లేదని స్పష్టం చేశారు.

అడిషనల్ డీజీ శిఖాగోయల్ ఆరా

ర్యాగింగ్ ఘటనపై తెలంగాణ అడి షనల్ డైరెక్టర్ జనరల్, ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ ర్యాగింగ్ కమిటీ అధికారి శిఖాగోయల్ ఆరా తీశారు. డీఎంఈ, గాంధీ ప్రిన్సి పాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించినట్లు తెలి సింది. సస్పెన్షన్‌తో ఏడాది వైద్యవిద్యను మాత్రమే కోల్పోతారని, కేసులు పెడితే విద్యార్థులు జీవితాలు నష్టపోవడంతో పాటు వారి కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతాయనే ఉద్దేశంతో సస్పెన్షన్‌తో సరిపెట్టామని డీఎంఈ రమేశ్‌రెడ్డి వివరించినట్లు సమాచారం.

'బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బిల్లుతో ఉపయోగం లేదు'



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోందని, ఈ బిల్లులో బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగినట్లేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళలకు ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లుతో బీసీలకు ఉపయోగం లేదని, అందుకే మహిళా బిల్లును బీసీలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

టెట్ పరీక్షా కేంద్రాలున్న విద్యా సంస్థలకు ఒకటిన్నర రోజుల సెలవు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈనెల 15న జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలుగా ఎంపికైన విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకటిన్నర రోజుల పాటు సెలవు ప్రకటించింది. ఆ విద్యా సంస్థల్లో టెట్ పరీక్షల ఏర్పాట్ల కోసం ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం సగం పూట, పరీక్ష రోజైన 15వ తేదీ ఉదయం, మధ్యాహ్నం ఈ కేంద్రాలకు సెలవు ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ పరీక్షా కేంద్రాలున్నాయి. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఈ పరీక్షలు ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి



ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ఎన్నికలు ముంచుకొస్తుండడంతో పరీక్షలు ఇంకెప్పుడు జరుగుతాయనే అయోమయానికి గురవుతున్నారు.

సన్నద్ధతకు సంకటం

ఏదైనా పరీక్ష తేదీని ప్రకటిస్తే అభ్యర్థులు సన్నద్ధతకు ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పూనుకోవడం, తదనుగుణంగా నోటిఫికేషన్లు ఇవ్వడంతో నిరుద్యోగ అభ్యర్థులు కఠోర దీక్షతో ప్రిపరేషన్‌లో పడ్డారు. కొందరు ప్రైవేటు ఉద్యోగాలను వదిలేసి మరీ సిద్ధమవుతున్నారు. మరికొందరైతే పనిచేస్తున్న ఉద్యోగాలకు దీర్ఘకాలిక సెలవులు పెట్టుకుని టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల తేదీలను ప్రకటించకుండా కమిషన్ కాలయాపన చేస్తుండటంతో సన్నద్ధత గాడి తప్పుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నెలంతా ప్రభుత్వ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత పరీక్షలు కొనసాగుతుండగా.. వచ్చే నెలలో సైతం పలు పరీక్షలకు కమిషన్ తేదీలు ఖరారు చేసింది. ఆగస్టు నెలలో నిర్వహించాల్సిన గ్రూప్–2 పరీక్ష నవంబర్ నెలకు వాయిదా పడింది. ఈ విధంగా పలు పరీక్షల తేదీలు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పరీక్షలపై తేల్చక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

హైదరాబాద్‌లో ఇన్‌స్పైర్ బ్రాండ్స్ ఇన్నోవేషన్ సెంటర్

కేటీఆర్‌తో భేటీ సందర్భంగా కంపెనీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మల్టీబ్రాండ్ రెస్టారెంట్ కంపెనీగా పేరొందిన 'ఇన్‌స్పైర్ బ్రాండ్స్' హైదరాబాద్‌లో ఆవిష్కరణల కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో బుధవారం భేటీ అయిన కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీఈఓ పాల్ బ్రౌన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 32 వేల రెస్టారెంట్లను కలిగిన ఇన్‌స్పైర్‌కు హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ఆవిష్కరణల కేంద్రం ఆరవదిగా కానుంది. హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న ఆవిష్కరణల కేంద్రం గత ఆరు నెలల్లో వంద మందికి ఉద్యోగాలు కల్పించగా, వచ్చే ఆరు నెలల్లో మరో వంద మందిని చేర్చుకోనుంది. 2025 నాటికి హైదరాబాద్‌లో మరో 500 మందిని చేర్చుకుంటుందని పాల్ బ్రౌన్ ప్రకటించారు. ఈ ఆవిష్కరణల కేంద్రం ద్వారా డేటాసైన్స్, అనలిటిక్స్, ఈ కామర్స్, ఆటోమేషన్, క్లౌడ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వంటి రంగాల్లో పనిచేసే సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల కోసం పనిచేస్తుంది. ఆవిష్కరణల కేంద్రంలో ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా మానవ వనరుల నిర్వహణ, చెల్లింపు విధానాలు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు తదితరాల కోసం స్థానిక స్టార్టప్‌లతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటుంది.

17 నుంచి 'ఆయుష్మాన్ భవ'

అక్టోబర్ 2 వరకు ఆరోగ్య మేళాలు, ఇతర సేవలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర పథకానికి సంబంధించి రాష్ట్రంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పల్లె, బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ఈ నెల 20, 27 తేదీల్లో ఆరోగ్య మేళాలు నిర్వహిస్తారు. రక్తపోటు, మధుమేహం, మూడు సాధారణ క్యాన్సర్లు అంటే ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. టీబీ, లెప్రసీ వంటి పరీక్షలు చేస్తారు. లైఫ్‌స్టయిల్ వంటి కార్యక్రమాలు చేపడతారు. ఉచిత మందులు ఇస్తారు. ఉచిత డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉంటాయి. టెలీకన్సల్టేషన్ సేవలు కల్పిస్తారు. అక్టోబర్ 2న రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల సమన్వయంతో ప్రతి జిల్లాలో ఒక శిబిరాన్ని నిర్వహిస్తారు.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన

స్టేషన్ మహబూబ్‌నగర్: ఢిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడి ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఏఐసీసీ పార్లమెంట్ పరిశీలకులు మోహన్‌కుమార్ మంగళం అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ తెలంగాణలో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో బహిరంగసభ తర్వాత రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏఐసీసీ నాయకులు పర్యటిస్తారని చెప్పారు. సోనియాగాంధీ ప్రకటించే గ్యారంటీ స్కీంలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకుంటుందని ఆరోపించారు. 17న జరిగే బహిరంగ సభలో ఇతర డిక్లరేషన్లతోపాటు గ్యారంటీ స్కీంలను సోనియాగాంధీ ప్రకటిస్తారని, జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు జంగయ్య యాదవ్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటేనని, ఇవి ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో దుర్మార్గమైన పాలన నడుస్తుందని, తెలంగాణ ద్రోహులు బీఆర్‌ఎస్ పక్కన ఉన్నారని, కాంగ్రెస్ వైపు ఉద్యమకారులు ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సీజే బెనహర్, అవేజ్, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్‌ఖాద్రీ, రాములుయాదవ్ పాల్గొన్నారు.



ఆలయాల పునరుద్ధరణకు ప్రతిపాదన



ఆలయంలో కొలతలు తీసుకుంటున్న స్టేట్ ఆర్కియాలజీ ఏడీ నర్సింగ్‌నాయక్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లోని అతి పురాతనమైన సూర్యనారాయణ స్వామి, యోగనారసింహ స్వామి ఆలయాలను పునరుద్ధరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ ఉభయ ఆలయాలు స్టేట్ ఆర్కియాలజికల్ పరిధిలో ఉండటంతో బుధవారం అసిస్టెంట్ డైరెక్టర్ స్టేట్ ఆర్కియాలజికల్ నర్సింగ్ నాయక్ వచ్చి ఆలయాలను పరిశీలించడంతో పాటు కొలతలు తీసుకున్నారు. వారు ఇక్కడ మూడు రోజులు బస చేసి పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వనున్నారు. నివేదిక అనంతరం ఆలయాల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుందని ఆలయ అధికారులు తెలిపారు. వీరితో పాటు ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ శ్రీకాంత్, సహాయకులు గోపి, వేణు తదితరులు ఉన్నారు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను బుధవారం రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంఘంచైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ దర్శించుకున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సీఎంఈ ప్లానింగ్ ఎస్‌సీ శివేంద్రమోహన్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

నేడు బంగారు ఆభరణాల రికార్డుల తనిఖీ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి గ్రూప్ సంస్థలకు చెందిన ఆలయాల్లో బంగారు ఆభరణాల రికార్డులను గురువారం పరిశీలిస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన సాక్షి దినపత్రికలో దేవుడి బంగారం భద్రమేనా? శీర్షికన వచ్చిన కథనంపై ఆలయ ఈఓ, పాలకమండలి స్పందించారు. ఇటీవల దేవస్థానం విధుల నుంచి సస్పెన్షన్‌కు గురైన సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ నుంచి దేవుడి ఆభరణాలను సరిచూసుకుని దేవస్థానం ఆ.దీనం చేసుకోనుంది. బంగారు ఆభరణాలు ఇప్పటికైనా బ్యాంకు లాకర్‌లలో భద్రపరిచి వాటిని ఇన్సూరెన్స్ చేయిస్తారా? లేక మళ్లీ ఆలయంలోనే ఉంచుతారా అనేది వేచి చూడాల్సి ఉంది.

గద్దరన్న పుట్టింది పేద ప్రజల కోసమే

- గద్దర్ కూతురు వెన్నెల



మాట్లాడుతున్న గద్దర్ కూతురు వెన్నెల, సభలో కూర్చున్న విమలక్క

అచ్చంపేట రూరల్: గద్దరన్న గుండె చప్పుడు ప్రతి ఒక్కరి గుండెల్లో కన్పిస్తుందని, ఆయన పుట్టిందే పేద ప్రజల కోసమని ప్రజా యుద్ధనౌక దివంగత గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద గద్దర్, జహీర్‌అలీఖాన్ యాది సంస్మరణ సభను నల్లమల కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. సభకు ముఖ్య అతిథిగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క, వెన్నెల, ప్రొ.కాశీం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్దరన్న పాటకు మరణం లేదన్నారు. ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేనిదన్నారు. పీడితులకు, బాధితులకు, అణగారిని వర్గాలకు తీరని లోటని, గద్దరన్న పాటలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం, సమ సమాజం కోసం అణచివేస్తున్న, అవమానిస్తున్న సమాజం కోసం గద్దరన్న పని చేశారన్నారు. ప్రజల మనిషిగా గుర్తించబడ్డారన్నారు. నల్లమల ప్రాంతంలో ప్రతి ఒక్కరి గుండెల్లో గద్దరన్న చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఎన్నో సమస్యలపై ఎన్నో పాటలు రాసి పాడి ఉద్యమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, కళాకారులు, నిర్వాహకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జూరాలకు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



దిగువజూరాలలోని పవర్‌హౌజ్‌లో చేరుతున్న వరదనీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 7గంటల వరకు ప్రాజెక్టు ఎగువ నుంచి 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 10వేల క్యూసెక్కులకు తగ్గింది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడెందొడ్డి లిఫ్ట్–1 వద్ద ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 117, ఎడమ కాల్వకు 640, కుడి కాల్వకు 639, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 60 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 13,280 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.173 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,021అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కుల కుడి, ఎడమ కాల్వ ద్వారా 20, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. బుధవారం 11,134 క్యూసెక్కులను వినియోగించి 4 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరదనీరు స్వల్పంగా చేరుతుండడంతో ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 84.077 ఎం.యూ., దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్లు, 90.769 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 174.846 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో 855.4..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 855.4 అడుగుల వద్ద 92.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 11,104 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 0.740 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 1,361 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. పోతిరెడ్డిపాడు ద్వారా 2వేలు, మల్యాల ఎత్తిపోల నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు 1,460, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. 276 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

విద్యుత్ బకాయిలపై దృష్టిపెట్టండి



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ మొండిబకాయిలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. శాఖ పనితీరుపై బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. వినియోగదారులకు తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించి వారికి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతి నెల విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్ బిల్లులు వసూలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వర్షాకాలంలో రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమీక్షలో శ్రీనివాస్‌రావు, మదన్‌మోహన్, గంపగోపాల్, రాములు, బిక్షపతి, ఎస్ఈలు, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

కుర్వలకు ఎస్సీ ధ్రువపత్రాలు ఇవ్వడమేంటి?

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని మదాసి, మదారి కురువల పేరిట బీసీ 'బీ' కులానికి చెందిన కొందరు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది బెంగుళూర్‌లో మెడిసిన్, ఐఐటీలో అడ్మిషన్లు పొంది విద్యనభ్యసించడం ఏమిటని నకిలీ మదాసి కురువ, మదారి కురువ ఎస్సీ సర్టిఫికెట్ల వ్యతిరేక కమిటీ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కురువ కులస్తులు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది విద్యనభ్యసిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, హైదరాబాద్ ఆర్డీఓ కార్యాలయం నుంచి ఎస్సీ ధ్రువపత్రాలు పొందినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. నిజమైన దళితులకు ఎస్సీ ధ్రువపత్రాలు ఇవ్వాలంటే తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వారి పూర్వీకుల ఎస్సీ ధ్రువపత్రాలు తీసుకురమ్మని చెప్పి, వారిని విచారించిన తర్వాతే ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో పని చేసే అధికారులు మదాసి, మదారి కురువలకు ఎలాంటి విచారణ చేయకుండానే బీసీ 'బీ' ధ్రువపత్రాలు కాకుండా ఎస్సీ ఇస్తున్నారని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 6వేలకు పైగా ఎస్సీ ధ్రువపత్రాలు పొందారని, వీటిపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న హైదరాబాద్ ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించామని, జిల్లా నుంచి వేలాది మంది దళితులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గోపాల్, అశోక్, ప్రవీణ్‌కుమార్, వెంకటస్వామి, సురేష్, రత్నయ్య, కృష్ణ, వెంకటేష్, యాదగిరి, యాదయ్య, నరేష్, సునీల్, భాస్కర్ పాల్గొన్నారు.

నదిలో దూకిన మహిళ

రాజోళి: మండల కేంద్రంలోని సుంకేసుల డ్యాం నుంచి ఓ మహిళ తుంగభద్ర నదిలో దూకింది. బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన వీరమ్మ నదిలో దూకింది. డ్యాం పరిసరాల్లోనే ఉన్న కర్నూల్ పట్టణానికి చెందిన కొందరు జర్నలిస్టులు గమనించి నదిలో దూకి ఆమెను ఒడ్డుకు చేర్చారు. కాగా ఆమెకు చికిత్స కోసం ముందుగా వడ్డేపల్లికి తరలించి, అక్కడి నుంచి వారి కారులోనే కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు జర్నలిస్టులు తెలిపారు.